అటకెక్కిన సుందరీకరణ

ప్రభుత్వం మారడంతో పరిశీలనకే పరిమితమైన ప్రతిపాదనలు

- అభివృద్ధికి నోచుకోని 'రోడ్ సైడ్ లేక్'
- వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లతోనే సరి
- కలగా మారిన ఆంపీ థియేటర్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, ఓపెన్‌జిమ్, బోటింగ్ ఏర్పాటు
- ప్రశ్నార్థకంగా మారిన యోగా సెంటర్
- ఇదీ రాయదుర్గం మల్కంచెరువు సుందరీకరణ పరిస్థితి'

రాయదుర్గం: ప్రభుత్వం, అధికార యంత్రాంగం మారిపోవడంతో ప్రాధాన్యతలు కూడా మారిపోయాయి. రాయదుర్గంలోని రోడ్ సైడ్ లేక్‌గా గుర్తింపు పొందిన మల్కంచెరువు అత్యాధునికంగా తీర్చి దిద్దేందుకు గత ప్రభుత్వ హయాంలో సుందరీకరణకు శ్రీకారం చుట్టారు. మూడేళ్ల క్రితం అపర్ణా నిర్మాణ సంస్థ సహకారంతో జీహెచ్‌ఎంసీలోని నీటి పారుదల విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన పనులను అప్పటి మంత్రి కేటీరామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నగరవాసులకు ఆహ్లాదపూరిత వాతావరణాన్ని కల్పించేందుకు మల్కం చెరువు వద్ద అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన పనులు వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటుకే పరిమితమయ్యాయి. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో పనులు పూర్తిగా అటకెక్కాయి. దీంతో సమీప భవిష్యత్తులో సుందరీకరణ చేపడతారనే ఆశ కూడా కనిపించడం లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని పనులు పూర్తి చేయాలని పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

వివరాలు.. విశేషాలు..

- రాయదుర్గం మల్కంచెరువు విస్తీర్ణం 51.30 ఎకరాలు
- జీహెచ్‌ఎంసీ నీటి పారుదల విభాగం పర్యవేక్షణలో సీఎస్‌ఆర్ కింద అపర్ణా కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా –సుందరీకరణ చేపట్టారు.



మల్కంచెరువు చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్(ఫైల్)

- ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీతోపాటు రూ. కోటి వెచ్చించగా, అపర్ణా నిర్మాణ సంస్థ సీఎస్‌ఆర్ కింద సుమారు రూ.30 కోట్ల వరకు వెచ్చించింది.

కల్పించిన సౌకర్యాలు ఇవీ........

- మల్కంచెరువు చుట్టూ 1.7 కిలోమీటర్ల సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, చుట్టూరా ఫెన్సింగ్, ప్రహరీ ఏర్పాటు చేశారు. ఆకట్టుకునేలా గ్రీనరీని ఏర్పాటుతో ఆహ్లాద వాతావరణంలో సైక్లింగ్, వాకింగ్ ఏర్పాటు చేశారు.
- గ్రీనరీ, ఎంట్రెన్స్ ప్లాజా, ఆకట్టుకునేలా లైటింగ్, ఇతర నిర్మాణ పనులు పూర్తయ్యాయి.
- చెరువు వెనుక దశాబ్దాలుగా ఉన్న భారీ బండ రాళ్లను పరిరక్షించడం విశేషం.
- గత ఏడాది చెరువును పూర్తిగా ఎండబెట్టి పూడికతీత తీసి మురుగునీటిని డైవర్షన్ కాలువతో కలపడంతో వర్షం నీరే నిల్వ ఉండేలా చర్యలు తీసుకున్నారు.
- గుర్రపుడెక్క తొలగింపు, ఇన్‌లెట్, ఔట్‌లెట్ పునరుద్ధరణ
- చెరువులోని సెడ్‌మెంటేషన్ ద్వారా గుర్రపుడెక్క సమస్య లేకుండా ఎస్టీపీ లేకుండా ఏడాదిపాటు నీరు ఉండేలా చర్యలు తీసుకున్నారు.
- చెరువు ఎంట్రెన్ ప్లాజా నుంచి లోపలికి రాగానే గణేష్ నిమజ్జన కోనేరు ఇప్పటికే కొనసాగుతోంది.
- చెరువు చుట్టూరా గ్రీనరీ, రంగురంగుల పూల మొక్కలను ఏర్పాటు చేశారు
- కడియం నుంచి తెప్పించిన ఫాక్స్‌టేల్ మొక్కలు 30, ఫిష్‌టేల్ 50 మొక్కలు ఆకట్టుకుంటున్నాయి.



మల్కంచెరువు(ఫైల్)

చేపట్టాల్సిన పనులు ఇవీ

మాదాపూర్‌లోని దుర్గంచెరువు నుంచి రాయదుర్గంలోని మల్కంచెరువు రెండూ గొలుసుకట్టు చెరువులు కావడంతో వాటిని కలుపుతూ కొత్త రోడ్డు నిర్మాణాన్ని ప్రతిపాదించారు.

- మల్కంచెరువువద్ద ఓపెన్‌జిమ్ సౌకర్యం, అర్ధచంద్రాకారంలో ఆంపీ థియేటర్‌నిర్మాణం, పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేక చిల్డ్రన్ ప్లే జోన్, లైటింగ్ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి.
- రాక్‌గార్డెన్, కేఫెటేరియా,మినీ నీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు అమలుకు నోచుకోలేదు
- బోటింగ్ సౌకర్యాన్ని కల్పించాలని తలపెట్టినా ఆ ఊసే మరచిపోయారు.
- యోగాసెంటర్ చేయాలని భావించినా ఆ దిశగా చర్యలు తీసుకోలేదు.

ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గతంలో చేసిన ప్రతిపాదనలే కాకుండా మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



సుందరీకరణ తర్వాత ఏర్పాటు చేసిన బోర్డు

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

రాయదుర్గం: దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి దివ్యాంగుల సమైక్య సంఘం అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగులకు రిజర్వేషన్లు అవసరం లేదని చెప్పే హక్కు ఎవరికీ లేదన్నారు. దివ్యాంగుల మనోభావాలను దెబ్బతినేలా మాట్లాడడం దారుణమన్నారు. దివ్యాంగుల సమస్యలు పరిష్కరించకపోగా సివిల్ సర్వీస్‌లో రిజర్వేషన్లు ఇవ్వరాదని చెప్పడం దివ్యాంగులను కించపరచడమేనన్నారు. ఇప్పటికైనా దివ్యాంగులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై దివ్యాంగుల సంక్షేమ శాఖ కమిషనర్ శైలజకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

షాపింగ్‌మాల్, మల్టీప్లెక్స్‌లో తనిఖీలు

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్స్‌ను మంగళవారం జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి అధికారులు పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఏసీపీ మెప్రా సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ షాపింగ్ మాల్స్, మల్టీప్లెక్స్‌లో పార్కింగ్ ఫీజువసూలు.. సౌకర్యాల కల్పనపై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. మాల్స్, మల్టీప్లెక్స్‌లలో మొదటి అరగంట పార్కింగ్ ఉచితంగా కల్పించాలని, ఆ తర్వాత ఒక్కో గంట చొప్పున రుసుము వసూలు చేయవచ్చని సూచించారు. అరగంట మించి అక్కడ ఏదైనా వస్తువు కొనుగోలు చేసినట్లు బిల్లు చూపిస్తే వాహనం ఎంతసేపు ఉన్నా పార్కింగ్ ఫీజు వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఆర్బిమ్ మాల్‌లో తనిఖీలు చేస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

బడ్జెట్ కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం విఫలం

మియాపూర్: ప్రభుత్వ ఉద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్‌లో పనిచేయవచ్చని చేసిన ప్రకటన లౌకికస్ఫూర్తికి గొడ్డలిపెట్టు అని ఎంసీపీఐయూ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ అన్నారు. ముజఫర్ అహ్మద్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఎంసీపీఐయూ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని రాష్ట్రాలకు సమానమైన పద్ధతుల్లో ఆయా రాష్ట్రాల ఆదాయం ప్రాతిపదికన నిధులు కేటాయించలేదన్నారు. బీజేపీ పాలిత, బీజేపీకి మద్దతు ఇస్తున్న రాష్ట్రాలకు అధిక నిధులు కేటాయించి రాష్ట్రాల హక్కులు, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసిందన్నారు. బడ్జెట్‌లో అన్ని వర్గాలకు సమాన నిష్పత్తిలో కేటాయింపు జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ ఉద్యోగస్తులు ఆర్‌ఎస్‌ఎస్‌లో పని చేయవచ్చని జీవో విడుదల చేయడం అప్రజాస్వామిక మన్నారు. జీవోను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మద్దికాయల అశోక్ ఓంకార్

ఓబీసీల హామీలను అమలు చేయాలి

బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం

పటాన్‌చెరు టౌన్: సీఎం రేవంత్ రెడ్డి ఓబీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం డిమాండ్ చేశారు. మంగళవారం ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల లోపే కులగణనచేసి బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారని వాటిని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవేందర్ గౌడ్, రవీందర్, శేఖర్ రెడ్డి, వీరారెడ్డి, అల్లంరాజ రెడ్డి, రాజేశ్, ఆంజనేయులు, అరవింద్ వెంకటేశ్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

నిధుల కేటాయింపుపై ఆరోపణలు అవాస్తవం

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

పటాన్‌చెరు: ప్రైవేట్ వ్యక్తుల ఆధీనంలో ఉన్న సీతారామ వెంచర్‌కు జీహెచ్‌ఎంసీ నిధులు ఖర్చు చేసి సీఎం, అధికారులు నిధులు ఇవ్వడం లేదని కార్పొరేటర్ ఆరోపణలు చేయడం సరికాదని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... పటాన్‌చెరు నియోజకవర్గానికి రోడ్లు, డ్రైనేజీకు ఇప్పటికే రూ.10 కోట్లు సీఎం విడుదల చేశారన్నారు. సీతారాంపురం ప్రైవేట్ వెంచర్లుకు రూ.45 లక్షలు డ్రైనేజీ, పైప్‌లైన్ పనులు ప్రతిపాదికలు కార్పొరేటర్ పంపడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ప్రభుత్వ నిధులు ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో మాజీ టీపీసీసీ సెక్రెటరీ మతిన్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అతిక్, కాంగ్రెస్ నాయకులు యువరాజ్ మోరే, వడ్డే గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

కూకట్‌పల్లి: వివేకానందనగర్‌లోని ప్రగతి మహిళా జూనియర్ కళాశాలలో మంగళవారం డాక్టర్ హరిత ఎంబీబీఎస్, డీజీఓ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. పౌష్టికాహారం, శారీరక, మానసిక దృఢత్వం, నెలసరి సమయంలో వచ్చే సమస్యలపై విద్యార్థినుల సందేహాలను డాక్టర్ హరిత నివృత్తి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, అధ్యాపకులు, ఫార్మా సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం హైదర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ జానకి రామరాజు ఎమ్మెల్యేను కలిసి సన్మానించారు. కార్యక్రమంలో బోస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌వీఎస్ రాజు, రాంమోహన్, రాజు, రాములు తదితరులు పాల్గొన్నారు.

న్యూఎరా పాఠశాలలో బోనాల సందడి





న్యూఎరా పాఠశాలలో నిర్వహించిన బోనాల పండుగ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలోని న్యూఎరా పాఠశాలలో మంగళవారం బోనాల పండుగ అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 9 గంటలకు అమ్మవారికి బోనం ఎత్తుకుని ఉపాధ్యాయులు చిత్తారమ్మ గుడికి వెళ్లి బోనం సమర్పించారు. అనంతరం 4, 5 తరగతి విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో భక్తి పారవశ్యంలో ముంచెత్తారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రెడ్డి, అకాడమిక్ ఇన్‌చార్జి అపర్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాన వేతనమివ్వాలి

బాలానగర్: జీహెచ్‌ఎంసీలో రిసోర్స్ పర్సన్స్‌కు ఇస్తున్న మాదిరిగా తమకు కూడా సమాన వేతనం ఇవ్వాలని కూకట్‌పల్లి మహిళా పొదుపు సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బాలానగర్‌లోని కార్యాలయంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు. తాము ఇరవై సంవత్సరాలుగా పొదుపు సంఘాలను నడిపిస్తున్నామని, ఎలాంటి వేతనం లేదన్నారు. మహిళా గ్రూపులు నడిపించటంలో తలెత్తుతున్న సమస్యలను వివరించారు.

కూరగాయల ధరలు...

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 70, పచ్చిమిర్చి 70, బెండ 40, కాకర 50, దొండ 40, దోస 40, ఆలు 40, చామ 60, కీర 30, బీర 40, వంకాయ 40, గోకర 50, బీన్స్ 80, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 70, క్యాబేజీ 40, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (1)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 200, వెల్లుల్లి 280.

సన్మానం...



శేరిలింగంపల్లి: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు బీజేవైఎం రాష్ట్ర నాయకులు నీరటి చంద్రమోహన్ శుభాకాంక్షలు తెలిపారు. హోం శాఖ సహాయ మంత్రిగా నియమితులైన సంజయ్ కుమార్‌ను మంగళవారం ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు.

వాహనదారులపై కేసులు నమోదు



వాహనాదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మియాపూర్: జాతీయ రహదారిపై యూ–టర్న్‌ల వద్ద రాంగ్ రైట్‌లో వెళ్తున్న 10 మంది ద్విచక్ర వాహనాదారులపై మియాపూర్ పోలీసులు కేసులు నమోదు చేసినట్లు మియాపూర్ ట్రాఫిక్ సీఐ ప్రశాంత్ తెలిపారు. మియాపూర్ మదీనాగూడ దీప్తిశ్రీనగర్ కాలనీ యూటర్న్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా రాంగ్ రూట్‌లో వచ్చిన ద్విచక్ర వాహనాలను సీజ్ చేసిన పోలీసులు వారిపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. ప్రధాన రహదారులపై రాంగ్ రూట్‌లో ప్రయాణించడం ప్రమాదకరమని యూటర్న్‌ల వద్ద అడ్డదారిలో వచ్చి పట్టుబడితే వాహనాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యం



పోచయ్య (ఫైల్)

మియాపూర్: ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మాణిక్యం కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదీనాగూడ, రామకృష్ణనగర్‌కు చెందిన పోచయ్య(30) మూడు నెలలుగా రామకృష్ణనగర్‌లో ఉంటూ వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 8న ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో అతడి భార్య ఎర్రోళ్ల సరిత మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిశుభ్రతలో ప్రథమస్థానంలో నిలపాలి



ఖాజాగూడలో మోడల్‌రోడ్డు డివైడర్‌ను పరిశీలిస్తున్న జెడ్సీ ఉపేందర్‌రెడ్డి

రాయదుర్గం: ఐటీ పరిశ్రమలకు వేదికైన శేరిలింగంపల్లి డివిజన్‌ను పరిశుభ్రతలో ప్రథమస్థానంలో నిలిపేందుకు సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఖాజాగూడ, రాయదుర్గం, శిల్పావ్యాలీ, టెలికామ్‌నగర్, ఇందిరా నగర్, రోలింగ్ హిల్స్, ప్రశాంత్‌నగర్, మసీదుబండ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్‌లోని ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు పరిశుభ్రంగా ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి అండర్ పాస్, ఫ్లైఓవర్‌పైనా నిత్యం స్వీపింగ్ ప్రక్రియను చేపట్టాలన్నారు. రహదారులను శుభ్రం చేసిన వెంటనే చెత్తను తొలగించాలని, ఎట్టి పరిస్థితులలో రహదారులపై వదిలివేయవద్దన్నారు. రహదారులకు ఇరువైపులా పేరుకునే ఇసుకను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో చేపట్టే పనులను వైద్యాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో రహదారులపై నీరు నిలువకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సమస్యలపై ఎప్పటికప్పుడు అనుబంధ విభాగాలకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్ వైద్యాధికారి డాక్టర్ నగేష్ నాయక్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎంఎస్‌తోనే సమస్యల పరిష్కారం



జెండాను ఆవిష్కరించిన జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్

పటాన్‌చెరు టౌన్ : కార్మికుల సమస్యల పరిష్కారం బీఎంఎస్‌తోనే సాధ్యమని జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం బీఎంఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పారిశ్రామిక వాడలోని అగర్వాల్ రబ్బర్ లిమిటెడ్ పరిశ్రమతో పాటు బస్టాండ్ వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రధాన కార్యదర్శి సాయన్న, జేకే ఫెన్నర్ ప్రధాన కార్యదర్శి నవీన్, భీమన, మధు, ఆంజనేయులు, సదాత అలీ, కృష్ణ పాల్గొన్నారు.

వికసిత భారత్ దిశగా కేంద్ర బడ్జెట్

గచ్చిబౌలి: వికసిత భారత్ లక్ష్యంగా వరుసగా ఏడో సారి ఆర్థిక మంత్రి హోదాలో నిర్మలాసీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ సీఏ పీవీ నారాయణరావు అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ స్థిర ఆర్థిక వృద్ధి పెంపుదల, ఉద్యోగ అవకాశాలను పెంపొందించటం తదితర అంశాలపై దృష్టి పెట్టడం అభినందనీయమన్నారు. రానున్న ఐదేళ్లలో 20 లక్షల నైపుణ్య యువతను తయారు చేయడం, ఉపాధి ఆధారిత ప్రోత్సాహ పథకాల ప్రకటనతో మరో 50 లక్షల ఉద్యోగాల కల్పన నిరుద్యోగులకు శుభవార్త వార్త అని పేర్కొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని పార్కుల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని కార్పొరేటర్ పుష్పనగేశ్ చెప్పారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్ కాలనీలో థీమ్ పార్కులో చిన్నారులు ఆడుకునే వస్తువులను ఏర్పాటు చేసేందుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కాలనీలో పర్యటించినప్పుడు కాలనీవాసులు పలు సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ప్రధానంగా థీమ్ పార్కులో చిన్నారుకు ఆటవస్తువులు ఏర్పాటు చేయాలని కోరారని చెప్పారు. దీంతో అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లగా రూ.15లక్షల మంజూరు చేశారని, అలాగే కాలనీలో రోడ్డు సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు.

ధర్నాను జయప్రదం చేయాలి



రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్ (ఎస్‌ఎఫ్‌ఏ)ల సమావేశాన్ని ఐబీ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 30న మంగళవారం ఇందిరాపార్కు వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులందరిని పర్మినెంట్ చేయాలన్నారు. పర్మినెంట్ చేసే వరకు కనీస వేతనాలు రూ.26 వేలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్స్, అనిల్, చందు, ప్రకాశ్, జ్ఞానేశ్వర్, ఎల్లప్ప, జగన్, జాషువా, వెంకటేశ్, సురేశ్, అరుణ్, శ్రీకాంత్, రాజు, వెంకటేశ్, మహేందర్, కృష్ణ, గోపాల్, సురేశ్, అశోక్, ఆనంద్, రాజు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన రాంగ్ రూట్ డ్రైవింగ్

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకుల దుర్మరణం

హఫీజ్‌పేట్ : రాంగ్ రూట్‌లో వెళుతున్న ఇద్దరు యువకులు ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రమేష్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా, కేసముద్రం మండలం, బెరువాడకు చెందిన చిట్టిమల్ల లింగయ్య కుటుంబం రెండేళ్ల క్రితం చందానగర్ శాంతినగర్‌కు వలసవచ్చింది. ఆయన చిన్న కుమారుడు చిట్టిమల్ల రాజు (26) మదీనాగూడలోని జీఎస్‌ఎం మాల్ కిచెన్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. చందానగర్ హుడా కాలనీకి చెందిన గొలుసు మనోజ్ (23) జీఎస్‌ఎంలోని హోటల్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 22న డ్యూటీకి వెళ్లిన వారు ఇద్దరూ మంగళవారం తెల్లవారు జామున బైక్‌పై జీఎస్‌ఎం మాల్ నుంచి రాంగ్ రూట్‌లో వస్తుండగా ఆర్‌ఎస్ బ్రదర్స్ షాపింగ్ మాల్ వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల కుటుబసభ్యులకు సమాచారం అందించిన చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.